క్లుప్తంగా...

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ఉన్న లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..తెలంగాణ సాధనకు అలుపెరగని పోరాటం చేసిన గొప్ప మానవతవాదని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ చీనా నాయక్, ఓఎస్‌ఓ డాక్టర్ సాయికృష్ణ నిఖిల్, అశ్వన్‌కుమార్, నిరోషా, నాగహర్షిత, శ్రీనివాసులు, మమత, మానస పాల్గొన్నారు.

ఇండియన్ స్వచ్ఛత లీగ్ పోటీలు



వ్యాస రచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

మణికొండ: ఇండియన్ స్వచ్ఛత లీగ్‌లో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు. అందులో భాగంగా బుధవారం రాక్‌వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. స్వచ్ఛత ఆవశ్యకతపై ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామని మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం తెలిపారు.

గోల్కొండ రిసార్టుకు అవార్డు



అవార్డును అందుకుంటున్న రిసార్టు ప్రతినిధులు

మణికొండ: గండిపేటలోని గోల్కొండ రిసార్టుకు ఉత్తమ 5స్టార్ రిసార్ట్ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో పర్యాటకాన్ని పెంపొందించేందుకు తమ సేవలను అందిస్తున్న సంస్థలకు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులను అందజేస్తోంది. బుధవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

వసతుల కల్పనకు పెద్దపీట



పనులకు శంకుస్థాపన చేస్తున్న సుష్మా

శంషాబాద్: పట్టణంలోని వివిధ వార్డుల్లో బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మా, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. డ్రైనేజీ, బీటీ, సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు ప్రవీణ్‌గౌడ్, భాగ్యలక్ష్మీ, మేకల వెంకటేష్, ముదిరాజ్, సంజయ్‌యాదవ్, రేఖ అజయ్, శ్రీకాంత్‌యాదవ్, భారతమ్మ పాల్గొన్నారు.

కోకాపేటలో రక్తదానం శిబిరం



రక్తదానం చేస్తున్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధి కోకాపేటలోని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ సారి సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే ఉద్దేశంతో బుధవారం ఉప్పల వెంకయ్య మెమోరియల్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా వంద మందికి పైగా యువకులు రక్తదానం చేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు.

డబుల్ ఇళ్లు.. 1816 మంది ఎంపిక

గచ్చిబౌలి: రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో డబుల్ బెడ్‌రూం మూడోవిడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం జరిగిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన 1816 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. మొదటి, రెండో విడతలో 1000 మందిని ఎంపిక చేశారని, మొత్తం 2,816 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 2, 5వ తేదీన ఇళ్ల కేటాయింపు ఉంటుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారని, ఇళ్లు ఎక్కువగా కేటాయించాలని మంత్రులకు విన్నవించగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు.



నార్సింగి వినాయకుడి వద్ద పూజలు చేసిన అశోక్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు



పూజలో పాల్గొన్న సినీనటుడు శివారెడ్డి, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా

రాజేంద్రనగర్ జోన్ బృందం: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో వినాయక నవరాత్రి పూజలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాద వితరణ, లడ్డూల వేలం పాటలు, నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. ఆయా మండపాల్లోని గణపయ్యలను భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకుంటున్నారు.



ఎస్‌వీఎస్ గ్రూప్ వారు కోకాపేట వినాయకుడి వద్ద మున్సిపల్ కార్మికులకు బియ్యం, నూనెలను పంపిణీ



మణికొండ హాల్‌మార్క్ ఫాం బ్రీజ్ గేటెడ్ కమ్యూనిటీ వినాయక పూజలో పాల్గొన్న స్థానికులు



అలకాపూర్ ఎంజీ పార్కు వినాయకుడి పూజలో పాల్గొన్న నాయకులు, నిర్వాహకులు



అలకాపూర్ రోడ్డు నెంబర్-13లో..



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు



కిస్మత్‌పూర్‌లోని ప్రెస్టీజ్ రాయల్ ఉడ్స్‌లో గణేశ్ నిమజ్జనోత్సవం



వినాయక పూజలో పాల్గొన్న డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ రాంచందర్‌రావు



గణనాథులకు స్వాగతం పలుకుతున్న నాయకులు



నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు



వినాయక ఊరేగింపులో.. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి



వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



గణేష్ నిమజ్జన ఊరేగింపులో యువకుల నృత్యాలు

రూ. లక్షలు పలుకుతున్న లడ్డూలు



రూ.1.53 లక్షలకు దక్కించుకున్న అశోక్‌యాదవ్



మంచిరేవుల బాలాజీ భక్త సమాజం వినాయకుడి లడ్డూను రూ.3.06లక్షలకు దక్కించుకున్న విష్ణువర్ధన్‌రెడ్డి



మంచిరేవుల వీరభద్ర భక్తసమాజం వినాయకుడి లడ్డూను రూ.7.12 లక్షలకు దక్కించుకున్న మల్లారెడ్డి

అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కమిషనర్ బి.శరత్‌చంద్ర ఆదేశించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాలన్నారు.

పరిశుభ్రతపై అవగాహన..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో విద్యార్థులను సైతం భాగస్వాములను చేయనున్నామని కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా కాళీమందిర్ సమీపంలోని డాన్ బాస్కో పాఠశాలలో బుధవారం విద్యార్థులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతపై చిన్న నాటి నుంచి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఫాదర్ నాదన్, వైస్ ప్రిన్సిపల్ సుజాతదేవి, ఉపాధ్యాయులు, శానిటరీ జవాన్లు నరేందర్, సురేష్, సుభాష్, యాదగిరి పాల్గొన్నారు.

ఎన్‌ఐఆర్‌డీలో ముగిసిన శిక్షణ



శిక్షణలో పూర్తి చేసుకున్న వారితో అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాలోని అప్పాపూర్, బోరాపూర్ గ్రామాలకు చెందిన గిరిజనులకు లీవ్స్ ప్లేట్లు, కప్పుల తయారీ కోసం ఇస్తున్న శిక్షణ ముగిసింది. రాష్ట్రంలోని గిరిజన, చెంచులకు పలు రంగాలలో శిక్షణ ఇవ్వాలని గవర్నర్ తమిళిసై సౌందరాజన్ ఆదేశాల మేరకు గత మూడు నెలలుగా శిక్షణ ఇస్తున్నారు. నరేంద్రకుమార్, అధికారులు పాల్గొన్నారు.

బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేస్తుండగా ఓ ప్రయాణికుడి మోకాలి ప్యాడ్ వద్ద అనుమానం రావడంతో విప్పి చూడగా 670 గ్రాముల బంగారం పేస్ట్ బయటపడింది. దాని విలువ రూ.40 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించి కేసు నమోదు చేశారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలంతా విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధి 7వ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో ఎంపీపీఎస్ స్కూల్ విద్యార్థులు, కార్పొరేటర్ పద్మావతితో కలిసి మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలన్నారు. భావితరాల బంగారు భవిష్యత్‌కు మొక్కలు నాటడం ఎంతో ముఖ్యమన్నారు. పాపయ్యయాదవ్, రాజుయాదవ్, జ్యోతి, ఇమ్రాన్, రవి, సాంసన్, ప్రధానోపాధ్యాయులు గోకుల్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లో బుధవారం హైదర్‌గూడ సిరిమల్లేనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం.సంగీత గౌరీ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలు వెలిసి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు రోడ్డు నిర్మాణ పనులు జరగకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు రోడ్డు పనులు ప్రారంభించాలని కోరిన వెంటనే మొదలు పెట్టడం జరిగిందన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సిద్దేశ్వర్, ఎల్.వెంకటేష్, సోమారం రవీందర్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ అన్‌ఫిట్ ప్రభుత్వం'



మాట్లాడుతున్న బైతి శ్రీధర్

శంషాబాద్: ఎన్నో ఏళ్లుగా నిరుద్యోగులు ఆశతో చదివి పరీక్షలు రాస్తున్నా వాటిని సక్రమంగా నిర్వహించలేనంత అన్‌ఫిట్ సర్కారు బీఆర్‌ఎస్‌ది అని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ఆరోపించారు. ప్రధాని మోదీ, కిషన్‌రెడ్డిలపై మంత్రి కేటీఆర్ చేసిన అన్‌ఫిట్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల అన్‌ఫిట్ పాలనలో అన్ని రంగాల్లో ప్రజలు ఆగమైపోయారన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబం మినహా రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా బాగుపడలేదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనవైపు ప్రపంచం తొంగిచూస్తోందని దేశం గర్వించేలా పాలన చేస్తున్న మోదీపై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. నేతలు శ్రీనివాస్, చంద్రయ్య పాల్గొన్నారు.

భయపెట్టి అసైన్డ్ భూములను కొనుగోలు చేస్తున్నారు

సర్వసభ్య సమావేశంలో రైతుల ఆవేదన



మాట్లాడుతున్న చైర్మన్ దానాకర్‌గౌడ్

శంషాబాద్ రూరల్: పేదలకు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములను కొంత మంది దళారులు భయపెట్టి తక్కువ ధరలకు కాజేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని చిన్న గోల్కొండ సొసైటీ ఆవరణలో చైర్మన్ దానాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కొంత మంది రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సయ్యద్‌గూడ, పెద్దగోల్కొండ, బహదూర్‌గూడ రెవెన్యూ పరిధిలో వందల ఎకరాలు రైతులకు అసైన్డ్ చేశారు. ఈ భూములను ప్రభుత్వం తిరిగి తీసుకుంటుందని భయపెడుతూ కొంత మంది దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అమ్మకుంటే దారి లేకుండా చేయడం.. కుటుంబ సభ్యులకు తగాదా సృష్టించి అమ్ముకునేలా చేస్తున్నారని రైతులు పేర్కొన్నారు. దళారుల వెనక కొంత మంది పెద్దల హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా బహదూర్‌గూడలో రైతులకు పట్టా పాసుపుస్తకాలు జారీ చేయాలని కోరారు. అంతకుముందు చైర్మన్ మాట్లాడారు. రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, మోహన్‌రావు, రూప, విజయలక్ష్మీ, ప్రశాంత్‌రెడ్డి, బాల్యానాయక్ పాల్గొన్నారు.

ముగిసిన విస్తరణ విద్యాసంస్థ వజ్రోత్సవాలు



మాట్లాడుతున్న డా.వీవీ సదావతే

ఏజీవర్సిటీ: ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని విస్తరణ విద్యాసంస్థ వజ్రోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ ముగింపు సమావేశంలో ప్రణాళికా సంఘం మాజీ సలహాదారులు డాక్టర్ వీవీ సదావతే పాల్గొని మాట్లాడారు. రైతులకు అధునాతన టెక్నాలజీల ద్వారా మరింత విస్తరణ సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణలో కొత్త విధానాల కోసం పనిచేస్తున్న సంస్థలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఇలాంటి సదస్సుల్లో వచ్చిన నూతన విస్తరణ ప్రతిపాదలను కొన్నింటిని ప్రయోగాత్మకంగా అమలు చేయడంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలన్నారు. ఉత్తమ విస్తరణ అధికారులు, ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్తలు, ఉపాన్యాసకులకు అవార్డులు అందించారు.

అంగన్‌వాడీల వంటావార్పు



వంటావార్పులో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

మణికొండ: అంగన్‌వాడీల డిమాండ్‌లను నెరవేర్చాలంటూ చేపట్టిన నిరవధిక సమ్మె గండిపేట మండల పరిధిలో కొనసాగుతుంది. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని వార్డు కార్యాలయం వద్ద వారు వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల అసోసియేషన్ మండల అధ్యక్షురాలు సుధారాణి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీల డిమాండ్‌లను నెరవేర్చాలన్నారు. ఇతర పలు శాఖల సిబ్బందిని క్రమబద్ధీకరించినట్లే అంగన్‌వాడీలకు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ కార్యదర్శి మీన, కోశాధికారి జ్యోతి, నాయకులు స్వరూప, నాగలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా గణేష్ ఉత్సవాలు



గణనాథులకు స్వాగతం పలుకున్న మజ్లిస్ పార్టీ నాయకులు



మజ్లిస్ నాయకులను సన్మానిస్తున్న ఏసీపీ గంగాధర్

ఏసీపీ గంగాధర్

రాజేంద్రనగర్: గణేష్ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ గంగాధర్ వెల్లడించారు. రాజేంద్రనగర్ చౌరస్తాలో మజ్లిస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికలపై నుంచి మజ్లిస్ పార్టీ నాయకులు, ముస్లిం సోదరులు గణేష్ ప్రతిమలకు స్వాగతం పలికారు. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీధర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు వేదిక వద్దకు వచ్చి ముస్లిం సోదరులను అభినందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... సోదరభావంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. రాజేంద్రనగర్‌లో మతసామరస్యానికి ప్రతీకగా గణేష్ ఉత్సవాలు కొనసాగుతున్నాయన్నారు.

'చిల్లర' ఇస్తానంటాడు.. డబ్బుతో ఉడాయిస్తాడు

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్: చిల్లర డబ్బే పెట్టుబడిగా పలువురిని నమ్మించి మోసం చేస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. బుధవారం డీసీపీ జగదీశ్వర్ రెడ్డి తన కా ర్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. వెస్ట్ గోదావరికి చెందిన అమరేశ్వర్ నాథ్ (28) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ప్రముఖ కంపెనీలో మంచి ఉద్యోగం చేసేవాడు. కరోనా సమయంలో ఉద్యోగం పోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించాలని శంకర్‌పల్లి, మాదాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మాల్స్, దుకాణాలు, పెట్రోల్ బంక్‌లను లక్ష్యంగా చేసుకున్నాడు. ఓ ప్రాంతంలో తన వద్ద చిల్లర ఉంది, నోట్లు కావాలని.. వ రో ప్రాంతంలో నోట్లు ఉన్నాయని.. చిల్లర కావాలంటూ మాటలు కలిపి నమ్మించేవాడు. నగదును వివిధ పేటీఎం, గూగుల్‌పే లో వేసుకొని తన వాహనంపై మనిషిని పంపిస్తే నగదును ఇస్తానంటూ తీసుకెళ్లేవాడు. కొద్ది దూరం వెళ్లాక ఇది తన ఆఫీస్, నివాసమంటూ చెప్పి ఉడాయించేవాడు. ఇలా ఐదు కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చాడు. మళ్లీ మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, నార్సింగ్, మొయినాబాద్, గచ్చిబౌలి, చేవెళ్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏడు కేసుల్లో డబ్బులు తీసుకుని ఉడాయించాడు. ఫిర్యాదు అందుకున్న చేవెళ్ల, రాజేంద్రనగర్ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. విచారణలో మరో ఏడు కేసుల వివరాలను తెలిపాడు. మరిన్ని కేసుల్లో ముద్దాయి అని, త్వరలో కస్టడీకి తీసుకొని విచారిస్తామని డీసీపీ తెలిపారు.